ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.9 | కనిష్ఠం 27.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
3
మంగళవారం 21 మే 2024



బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి రూరల్, మే 20: 2024-25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 3,5,8వ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతి బాలురకు 7, బాలికలకు 4,5వ తరగతిలో బాలురకు 4, బాలికలకు 2, 8వ తరగతిలో బాలురకు 3, బాలికలకు 2, సీట్లు కలవని తెలిపారు. కుంటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర ఉండాలన్నారు. దరఖాస్తు వెంట జనన, కుల ధ్రువీకరణ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలన్నారు.

కొనుగోళ్ల కష్టాలు





కామారెడ్డి, మే 20(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ధాన్యం అమ్మిన రైస్‌మిల్లులకు తరలించేదాక రైతులదే బాధ్యత అని చెప్పడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు తరుగు పేరిట రైస్ మిల్లర్లు దోపిడీ చేస్తుంటే మరోవైపు ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించేందుకు లారీలు రాక కొనుగోలు జరగడం లేదు. దీంతో ధాన్యం రాశులతో, అమ్మిన ధాన్యం సంచులతో కేంద్రాల్లోనే రోజుల తరబడి రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. జిల్లాలో చాలా కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని కేంద్రాల వద్ద ధాన్యం రాశులతో కాపలా కాయలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లు చేయాలని, లారీల కోసం రైతులు రోడ్లెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కుప్పల వద్దే నిరీక్షిస్తున్నాం

● సాయన్న, నిజాంసాగర్

నిజాంసాగర్ శివారులో 2 ఎకరాల్లో వరి సాగు చేశాను. 85 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి నెల రోజుల కింద తీసుకువచ్చాను. 20 రోజుల క్రితం ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. లారీలు రాకపోవడంతో 20 రోజులుగా వరి ధాన్యం కుప్పలు, సంచుల వద్దే కాపల కాయాల్సి వస్తోంది. లారీలు రాకపోవడంతో మిల్లులకు ధాన్యాన్ని తరలించేవరకు తమదే బాధ్యతని కేంద్రాల నిర్వాహకులు చెప్పడంతో ఇబ్బందిగా మారుతుంది.

ఆందోళనకు దిగుతున్న రైతులు

ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు చేయాలంటూ ధాన్యం తడిసిపోతుందంటూ రైతులు కొన్నిచోట్ల రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతో కొనుగోళ్లు చేయడం లేదని రైతులు రోడ్డెక్కారు. బాన్సువాడ అన్నాసాగర్ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. తాజాగా సోమవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని అచ్చంపేట, విండోపల్లిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు రాస్తారోకో ధర్నా చేపట్టారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, లారీలు రావడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజుల కిందట మాచారెడ్డి, బీబీపేట మండలాల్లోనూ రైతులు ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కి రాస్తారోకో చేపట్టారు.

లారీల కొరతతో ఇబ్బందులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకై 350 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పలు రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేశారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్ సమస్య లేకుండా ఐదు సెక్టార్‌లుగా విభజించినప్పటికీ కొనుగోళ్లలో ట్రాన్స్‌పోర్ట్ సమస్య ఎదురవుతోంది. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం తరలింపులో లారీల కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లారీలు సకాలంలో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాల్సి ఉండగా ఆలస్యం చేస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. లారీల కొరత ఉండడం, టెండర్లు వేసినా కాంట్రాక్టర్‌లు సరిపడా లారీలను సమకూర్చకపోవడంతో కేంద్రాలకు లారీలు రావడం లేదు. దీంతో రోజుల తరబడి ఎండనక, వాననక ధాన్యం కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్నిచోట్ల లారీలు లేకపోవడంతో రైతులే స్వయంగా సొంత ఖర్చులతో ట్రాక్టర్‌ల ద్వారా మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

- జిల్లాలో ట్రాన్స్‌ఫోర్ట్ సమస్యతో కేంద్రాల్లోనే నిలిచిన ధాన్యం రాశులు
- ధాన్యం అమ్మినా మిల్లులకు తరలని పరిస్థితి
- ధాన్యం మిల్లులకు చేరేదాకా రైతుదే బాధ్యత
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తప్పని నిరీక్షణ
- లారీలు రాకపోవడంతో రోడ్లెక్కి ఆందోళన చేస్తున్న రైతులు
- జిల్లాలో ఇప్పటి వరకు 2.64 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

మిల్లుల్లో తరుగు పేరిట దోపిడీ

జిల్లాలోని పలు మిల్లుల్లో తరుగుపేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ధాన్యం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని పదేపదే హెచ్చరిస్తున్నా చాలా మంది మిల్లర్లు మాత్రం అనేక కొర్రీలు పెట్టి ధాన్యం దండుకుంటున్నారు. తాళ్లు, తేమ ఉన్నాయంటూ బరువు రావడం లేదంటూ పలు కొర్రీలు పెడుతూ మిల్లర్లు నాలుగు నుంచి ఆరు కిలోల వరకు తరుగు తీస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా తరుగు తీయడంతో క్వింటాల్‌కు పది కిలోల వరకు నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 350 కేంద్రాలను ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 46,813 మంది రైతుల నుంచి రూ.583 కోట్లు విలువ చేసే 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 529 కోట్ల ధాన్యం డబ్బులను ఆయా రైతుల ఖాతాలో జమ చేశారు. పలు కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించి వెంటనే రైస్‌మిల్లులకు తరలిస్తున్నప్పటికీ మరికొన్ని కేంద్రాల్లో లారీలు రాక కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 120 కేంద్రాల్లో కొనుగోలు పూర్తవడంతో వాటిని మూసి వేశారు.

కొనుగోలు చేయడం లేదు

● భూపాల్‌రెడ్డి, బీబీపేట

బీబీపేట శివారులో నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. 120 బస్తాల వరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి 20 రోజుల కిందట తరలించాను. లారీలు రావడం లేదని కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదు. లారీలు, కూలీలను అందుబాటులో ఉంచి వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి.

24లోగా కొనుగోళ్లను పూర్తి చేయాలి



కామారెడ్డిలో ఇంటర్ పరీక్షల నిర్వాహణపై సీఎస్, డీవోల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 20: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఈనెల 24లోగా పూర్తి చేయాలని కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ప్రత్యేకాధికారి శరత్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో మూసివేసిన 180 కేంద్రాల సిబ్బందిని, హమాలీలలను, తూకం యంత్రాలను వద్ద ఎక్కువగా ఉన్న కేంద్రాలకు తరలించి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తరలింపులో కాస్త ఇబ్బందులెదురైనా ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉన్నందున రోజు 10వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం తరలించుటకు నేటి నుంచి కొనుగోలు కేంద్రాలు పగలు, రాత్రి పనిచేసేలా చక్కటి కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. తహసీల్దార్‌లు, వ్యవసాయాధికారులు, ఏపీఎంలు బాధ్యత తీసుకుని కేంద్రాలను సందర్శించి నాలుగు రోజుల్లో పూర్తి ధాన్యం సేకరించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2.64లక్షల మెట్రిక్ టన్నుల చేసి 97శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసి 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి డబ్బులు చెల్లించామని ప్రత్యేకాధికారికి తెలిపారు. ఇందులో 230 కేంద్రాల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని, అక్కడి హమాలీలను తూకం కొలిచే యంత్రాలను వద్ద ఎక్కువగా ఉన్న కేంద్రాలకు తరలించి ప్రతీరోజు కొన్ని కేంద్రాల చొప్పున మిగిలిన 120 కేంద్రాల్లో శుక్రవారం నాటికి పూర్తిగా కొనుగోలు చేసే విధంగా రోజువారి కార్యాచరణ రూపొందించి అధికారులతో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, ఇన్‌చార్జ్ జిల్లా మేనేజర్ నిత్యానందం, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, సహకార శాఖ అధికారులు ప్రశాంత్‌రెడ్డి, భూమయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు తావివ్వవద్దని ఆయన హెచ్చరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో మొత్తం 29 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరంలో జనరల్ 5532 మంది, వొకేషనల్ 704 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 3860 మంది, వొకేషనల్ 41 మంది మొత్తం 10,511 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి శేఖ్ సలామ్, జిల్లా పరీక్షల నిర్వాహణ అధికారులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య, జేఎల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిజాం, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు సీఎస్, డీవోలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో



బీబీపేటలో రోడ్డుపై బైఠాయిస్తున్న రైతులు

నిజాంసాగర్, మే 20: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, ధాన్యం కోత విధించడంతో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్ర పరిధిలో అచ్చంపేట విండో పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఎల్లారెడ్డి - నాందేడ్ ప్రధాన రహదారి రాస్తారోకో నిర్వహించారు. 6 వేల బస్తాల వరకు ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ రైస్‌మిల్లర్లు ఆంక్షలు విధిస్తూ ధాన్యంలో కోత విధిసున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు 31,10,039 బస్తాల ధాన్యం వివిధ రైస్‌మిల్లులకు వెళ్లినట్లు విండో అధికారులు తెలిపారు. 40 లారీల్లో ఆయా రైస్‌మిల్లులకు పంపగా, కోత విధించలేదని వారన్నారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలోని రైస్‌మిల్లర్లు బస్తాకు ఒక్కంటికి 42కిలోల 600 గ్రాములుంటేనే వరి ధాన్యం తీసుకుంటామని తెలిపారన్నారు. రైతులు ధర్నా చేపట్టడం సరికాదని సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తెలిపారు. రహదారిపై రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై సుధాకర్ అక్కడికి విచ్చేసి రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. ఈ ధర్నాలో సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

బీబీపేట: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గత 3,4 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు జరగకపోవడాన్ని నిరసిస్తూ రైతులు బీబీపేటలో రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం నిర్లక్ష్యంతో ధాన్యం కాంటా చేయడం లేదని, ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించడం లేదని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే ఆ ధాన్యంలో కోత విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఐడీసీఎంఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి వచ్చి రైతులను సముదాయించి వెంటనే కొనుగోలు జరపడానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు.

గ్రామాల్లో.. ఎన్నికల హడావుడి!

- ప్రతీచిన్న అవకాశాన్ని ఉపయోగించుకుంటున్న ఆశావహులు
- అభివృద్ధి చేసే వారినే ఎన్నుకుంటామంటున్న యువకులు
- పార్టీ మారిన వారిలో మొదలైన టెన్షన్
- గ్రామ పంచాయతీల్లో గెలుపు గుర్రాల కోసం పార్టీల వెతుకులాట

భిక్కనూరు, మే 20: గత జనవరి చివరిలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కాగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగా వచ్చే నెలా మొదటివారంలో ఎన్నికల కోడ్ ముగియగానే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఏక్షణమైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే చర్చలు జోరందుకోవడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులు గ్రామాల్లోనే ఎక్కువ సమయం గడుపుతూ ఇంటింటికీ తిరుగుతూ ఈసారి అన్నీ కలిసొస్తే సర్పంచ్‌గా పోటీ చేయేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. అందివచ్చిన ప్రతీ చిన్న అవకాశాన్ని అశావహులు సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో తిరుగుతున్నారు. ముఖ్యంగా యువతతో ఎక్కువ సమయం గడుపుతూ వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యంగా తాజా మాజీ సర్పంచ్‌లు రిజర్వేషన్లు కలిసొస్తే మరల పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. వారితో పాటుగా గతంలో ఓడినవారు, యువత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లోని వాట్సప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్‌లలో ఎక్కువగా ఈ గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసేవారు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, ఎవరిని ఎన్నుకోవాలి, తదితర అంశాలపై చర్చలు జోరందుకున్నాయి. కాగా సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు ఈ సారీ ఎంతఖర్చు అయినా పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ప్రతీ చిన్న అవకాశాన్ని ఉపయోగించుకుంటున్న ఆశావహులు

సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఏ చిన్న అవకాశం వచ్చినా ఉపయోగించుకుంటు న్నారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలతో పాటుగా ప్రతీ మంచి, చెడు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు గ్రామంలో ఏదైనా గొడవలు, పంచాయతీలు జరిగి పోలీసుస్టేషన్ కేసులు అయితే వీరే ముందుంటున్నారు. గ్రామాల్లోనే ఎక్కువ సమయం గడుపుతూ ప్రతిరోజూ గ్రామంలో ఇంటింటికీ తిరగడం, ఉపాధి పనుల వద్దకు వెళ్లి అక్కడ ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గతంలో ఎప్పుడు లేని విధంగా అందరితో అప్యాయంగా మాట్లాడటం, వారి ఇళ్లలో వారంలో ఒకటి, రెండు సార్లు సహపంక్తి భోజనాలం ఏర్పాటుం చేయండం లాంటివి చేస్తూ అందరి దృష్టిని ఆకర్శించేందుకు తీవ్రంగా కష్టపడుతున్నారు.

గ్రామాల్లో సిట్టింగులు షురూ..

జూన్, జూలై నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు మొదలుపెట్టగా ఏ క్షణమైనా గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే ప్రచారం జోరందుకోవడంతో గ్రామాల్లో ఆశావహులు మందు సిట్టింగులకు తెరదించారు. గ్రామాల్లో ముఖ్యంగా రాత్రి సమయాల్లో వారంలో రెండు, మూడు సార్లు యువకులకు, వారి అనుచరులకు, గ్రామ పెద్దలకు మందు సిట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు ఆదివారాల్లో ఇంటికో కూల్‌డ్రింక్స్ బాటిళ్లను అందజేస్తున్నారు. గ్రామంలో ఏదైనా జాతర్లు, బోనాలు లాంటి కార్యక్రమాలుంటే వాటిల్లో మద్యానికి అయ్యే ఖర్చును పోటీపడి మరి భరిస్తున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసే వారినే ఎన్నుకుంటామంటున్న యువకులు

ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా.. ఎన్ని మందు సిట్టింగులు పెట్టినా యువకులు మాత్రం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేవారికే తమ మద్దతు ఉంటుందని పలువురు యువకులు బహిరంగంగానే వారి అభిప్రాయాన్ని చెబుతున్నారు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చిన పలువురు సర్పంచ్ పదవీ రాగానే ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇష్టారీతిగా వ్యవహరించి గ్రామాభివృద్ధిని మరిచి అడ్డగోలుగా సంపాదించుకున్నారని, ఈ సారి మాత్రం గతంలో మోసగించి పదవిని పొందినటువంటి వారిని కాకుండా గ్రామాన్ని అభివృద్ధి చేసేవారిని ఎన్నుకుందామని ఆన్‌లైన్ మాధ్యమాల్లో, 10 మంది యువకులు కలిసిన చోట చర్చించుకుంటున్నారు.

పార్టీలు మారిన వారిలో మొదలైనా టెన్షన్

గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెజార్టీ సర్పంచ్ స్థానాలను 10 సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ దక్కించుకుంది. కాగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పెద్దఎత్తున తాజా మాజీ సర్పంచ్‌లతో పాటుగా పలువురు ఆశావహులు ఇటీవలే బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లోకి చేరారు. కానీ పదవుల కోసం పార్టీని మారిన వారికి గ్రామాల్లో కొత్త తలనొప్పి మొదలైంది. గ్రామాల్లో వారి అవసరాలకు పార్టీలు మారిన వారికి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ మద్దతు ఉండదని పలువురు చెబుతున్న పరిస్థితి. దీంతో పదవుల కోసం పార్టీలు మారిన వారికి అసలు పోటీ చేసే అవకాశం దక్కుతుందా, ఒక వేళ దక్కిన గెలిచే చాన్స్ ఉంటుందా అని టెన్షన్ పట్టుకుంది.

గెలుపు గుర్రాల కోసం పార్టీల వెతుకులాట

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే గెలుపు గుర్రాల కోసం ఆయా పార్టీల నాయకులు వెతుకులాట మొదలుపెట్టారు. గ్రామాల్లో తిరుగుతూ ఎవరిని సర్పంచ్‌గా పోటీ చేసేందుకు అర్హుడని ఆరా తీస్తున్నారు. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ వారి అభిప్రాయాలను తీసుకుంటున్నారు. ఎలాగైనా జిల్లాలో ఎక్కువ సర్పంచ్ స్థానాలను దక్కించుకోవడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ వ్యూహాలను రచించడం మొదలుపెట్టాయి. అందులో భాగంగానే ఆయా పార్టీలు చేరికలను ముమ్మరం చేస్తున్నాయి.

కేంద్రప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల గ్రామసందర్శన

కామారెడ్డి టౌన్, మే 20: మండలంలోని పద్మాజీవాడిలో జరిగిన అభివృద్ధి పనులను శిక్షణలో ఉన్న కేంద్రప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణలో ఉన్న అధికారులు గ్రామస్థాయి సందర్శన నిర్వహించారు. గ్రామంలో ఇంత వరకు చేసిన సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, హరితహారం, విద్యుత్ దీపాల ఏర్పాటు గ్రామ పంచాయతీ నిర్వహణ తదితర అంశాలపై గ్రామంలో క్షుణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డిటౌన్, మే 20: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్‌లు, రైస్‌మిల్లుల ప్రతినిధులు, సహకార, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు నాలుగు రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల యాజమానులు ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు. సివిల్‌సప్లయ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాలలో రూ.583 కోట్ల విలువైన 2.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ఖాతాలలో రూ.529కోట్ల జమచేసినట్లు చెప్పారు. 97శాతం ట్యాబ్ ఎంట్రీపూర్తయిందని వెల్లడించారు. రవాణాశాఖ అధికారులు లారీలను ఏర్పాటుచేయడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించిన అధికారులు

పారిశుధ్య చర్యలు చేపట్టిన అధికారులు

బాన్సువాడ, మే20: 'సంగోజీపేట్‌లో పడకేసిన పారిశుధ్యం' అనే శీరికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి మోహన్‌కు గ్రామంలో నెలకొన్న పారిశుధ్యలోపంపై చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు శుభ్రపర్చి రోడ్డుపక్కన ఉన్న చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. కంపోస్టు షెడ్డును ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామంలో ఎక్కడ చూసిన పరిశుభ్రత కనిపించడాన్ని చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం

కమ్మర్‌పల్లి, మే20: చౌట్‌పల్లిలోని లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణోత్సవం సోమవారం కనులపండుగగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సావాలలో భాగాంగా రెండోరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, బలిహరణం, ధ్వజారోహనం, భేరీపూజ, దేవతాఅహ్వాణం, స్వామివారి ఎదుర్కోలు, కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం స్వామివారి కల్యాణం, మాహనసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు, గ్రామకమిటి సభ్యులు కోరారు.

షాహిన్ ఆసుపత్రి ఘటనపై అధికారుల విచారణ

పెద్దబజార్, మే 19: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ గర్భశయాన్ని తీసివేయాల్సి వచ్చిన ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం నగరంలోని ఖిల్లారోడ్‌లోగల షాహిన్ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన విచారణ జరిపారు. వైద్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారు. తప్పిదం జరిగినట్లు తేలితే తదుపరిగా ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోనున్నారు.

'మంత్రాల నెపంతో దాడి చేసిన వారిని శిక్షించాలి'

పెద్దబజార్, మే20: చిందు కళాకారులుగా జీవిస్తున్న వృద్ధ దంపతులు, తమ కుటుంబ సభ్యులపై అకారణంగా భౌతిక దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని హమ్మాపూర్ చిందు కళాకారులు పులింటి శ్రీనివాస్, శంకర్, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రాలు చేసి పశువులను, మనుషులను చంపుతున్నామని, తమను చంపాలని దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై కర్రలతో, సీసాలతో తలపై దాడి చేసినట్లు వర్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

తూకాల్లో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లా, మే 20: తూకాల్లో జరిగే మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు మాయావర్ రాజేశ్వర్ సూచించారు. తూనికల కొలతల దినోత్సవం సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గంజ్ ప్రాంతంలో దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల కొలతల విషయంలో వినియోగదారులు జాగ్రత్తగా పాటించాలన్నారు. కొనుగోలు చేసే సమయంలో ఐఎస్ఐ మార్క్ లాంటివి మాత్రమే కొనుగోలు చేయాలని, కొన్న వస్తువుకు వ్యాపారస్తుల నుంచి బిల్లులు తీసుకోవాలని బిల్లులు ఉన్నట్లయితే వినియోగదారుల ఫోరం కోర్టులో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వ్యాపారస్తులు కిరాణా షాపుల్లోగానీ, సూపర్ మార్కెట్‌లోగానీ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తూకం సరిగా వేస్తున్నారా, ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా తూకం వేసినప్పుడు కరెక్టుగా తూకం వేసే విషయాలను గమనించాలన్నారు. వ్యాపారస్తులు తక్కువ తూకం వేస్తే, ఎంఆర్‌పీ రేటు కంటే ధరలు ఎక్కువగా తీసుకున్నట్లయితే తూనికల కొలతల శాఖకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ సుజాత్‌అలీ, టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్ రావు, నరేష్, సుశ్మిత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న బోలేరో పట్టివేత

కోటగిరి,మే20: పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బోలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పొతంగల్ గ్రామంలో ఏపీ29టీవీ7849 వాహనాన్ని తనిఖీ చేయగా ఇసుకను గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీపీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

కోటగిరి, మే20: గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గత 8నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. జీతాలు లేకుండా సిబ్బంది ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. పంచాయతీ సిబ్బంది కుటుంబ పోషణ కోసం అప్పుల పాలవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానంతో తీవ్ర పని ఒత్తిడి పెంచిందని ఆరోపించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలు మండిపోతున్న పనులు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, రజిని, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, రుణాలను సకాలంలో అందించాలి

బోధన్‌రూరల్,మే20: రైతాంగానికి సకాలంలో విత్తనాలు, రుణాలు అందించాలని అఖిల ప్రగతిశీల రైతు సంఘం నాయకులు పడాల శంకర్ అన్నారు. సోమవారం బోధన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు చేయడానికి రైతాంగం సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన విత్తనాలు, జీలుగ విత్తనాలను మాత్రమే పంపిణీ చేసిందని, వీటితో పాటు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం ఇస్తానన్న 10వేల రూపాయలు కూడా ఇప్పటి వరకు చెల్లించలేదని, ప్రస్తుతం నష్టపోయిన రైతులకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల ప్రగతిశీల రైతు సంఘం నాయకులు సుల్తాన్ సాయిలు, సీతారాం, గంగయ్య, రాములు, పోశెట్టి, భీంరావు, గంగారాం, లాలయ్య తదితరులున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,మే20: మండలంలోని సాలంపాడ్ గ్రామానికి చెందిన చిన్నుగొండ (49) పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోస్రా, మే 20: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఎత్తు, బరువు కొలతతలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే రిజిష్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అంగన్‌వాడీ టీచర్ సుజాతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమతతో పాటు చందూర్ అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, ఆయా లత, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ



సిద్ధులగుట్టపై పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, మే20: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.గుట్టపైకి విచ్చేసిన భక్తులందరు శివాలయంలో అభిషేకాలు, రామాలయం, దుర్గామాత, దత్తాత్రే, అయ్యప్ప ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. సిద్దుల గుట్టపై నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో భజన మండలి సభ్యులు, భక్తులు భక్తీగీతాలు, నృత్యాలతో అలరించారు. సిద్దులగుట్ట ఆలయ కమిటీ ఆవరణలో భక్తులందరికి అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, బోండ్ల ఆనంద్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, ప్రశాంత్ గౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనాలు

డిచ్‌పల్లి, మే 20: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో ఉదయం 8గంటలకు విత్తన వేళ ఆవశ్యాకత వానాకాలానికి అనువైనా వరి వంగడలు ,వరి మొదళ్ల కాల్చివేతపై జరిగే అనార్థలపై శాస్త్రవేత్తల సలహాలు సూచనాలు ఉంటాయని రైతులు ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంబాబు తెలిపారు.

లొంకరామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళాలు



ఆలయ కమిటీకి విరాళం అందేసిన గడ్కోల్ ఎలాల్ బాపు దంపతులు

సిరికొండ మే 20: సిరికొండ సమీపాన అడవీలో కొలువుదీరిని శ్రీలొంకరామలింగేశ్వర ఆలాయ అభివృద్ధికి గడ్కోల్ గ్రామానికి చెందిన ఎలాల్‌బాపు రాంచందర్ రూ.50116లు విరాళం అందజేశారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాడాల సంతోష్ తెలిపారు. ఎలాల్‌బాపు దంపతులు కుమారుడు రాంచందర్ తరపును ఆలయానికి వచ్చి విరాళాన్ని అందజేయడం పట్ల కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.దంపతులను సోమవారం ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. లొంకలో అన్న సత్రం నిర్వాహణ కోసం గాజుల హారతి శ్రీపతి దంపతులు, ఐదువేల ఒక వంద, రావుట్ల గంగామరి రాజన్న దంపతులు రూ.5020లు,తరడక రణదీర్ రూ.1011లు,ఎలాల బాపు తదితరులు అన్నసత్రం నిర్వాహణ కోసం విరాళాలు ఇవ్వడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గడ్కోల్ మాజీ ఎంపీటీసీ సభ్యులు లింబాద్రి,కమిటీ సభ్యుల బాడాల సంతోష్ అవదూత గంగాధర్, కోల భూపతిరాజ్,బోయిడి ప్రకాష్,పులి దాస్, సాంబయ్యపూజారి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



బీర్కూర్ రైతు వేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

బీర్కూర్,మే 20: రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించాలని ఎంపీపీ రఘు ఆయా షాపుల యజమానులకు సూచించారు. రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని నాసిరకం నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ రఘు వ్యవసాయ అధికారులు, ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల డీలర్లతో సమావేశమయ్యారు. రాబోయే వానాకాలం సీజన్ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. రైతులకు కొనుగోలు చేసిన వాటికి షాప్ నిర్వాహకులు తప్పనిసరిగా రషీదు అందజేయాలన్నారు. గత సీజన్‌లో వరి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా వ్యవసాయ శాఖ అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి భారతి, ఏవో కమల, బీర్కూర్ సీనియర్ ఏఈవో శ్రావణ్ కుమార్, బైరాపూర్ ఏఈవో కావ్యశ్రీ, వివిధ సహకార సంఘాల అధికారులు, ప్రైవేట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా యధావిధిగా కొనసాగుతా



ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి, మే 20:ఈనెల 18న ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కౌ న్సిలర్లతో అవిశ్వాస సమావే శాన్ని నిర్వహించినంత మాత్రన తమ అధికా రాన్ని కోల్పోలేదని యదావిధిగా తమ అధికారాలు కొనసా గుతాయని ఎల్లా రెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిశ్వాస సమావేశం నిర్వహించిన తరువాత అవి శ్వాసానికి సంబంధించిన వివరాలను అవిశ్వాసం నెగ్గిందని, నెగ్గలేదని అధి కారులు ఎక్కడ ప్రకటించలేదని తెలిపారు. అవిశ్వాస ప్రక్రియ కోర్టు పరిధిలో ఉందని అన్నారు. గతంలో ఉన్నట్లు తమకు అన్ని అధికారాలు ఉన్నాయని అన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అర్గుల్‌లో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే20: మండలంలోని అర్గుల్ గ్రామంలో మైనారిటీ పెద్దలు ఉర్సు ఉత్సవాలను మైనారిటీ పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి ఉర్సు ఉత్సవాలు జరగగా సోమవారం గ్రంథలు ఉత్సవాలు జరుపుకున్నారు. గురువు ముజిబ్ అన్సారీ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉర్సు ఉత్సవాల సందర్భంగా మైనారి టీ గుట్ట వద్ద మూడు రోజుల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గురువు ముజిబ్‌అన్సారీ మైనారిటీ పెద్దలు బడేమియా, పాషా, ఇంతిసరోద్దిన్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మైనారిటీ పెద్దలు

నిధులు మంజూరైనా పనులు సున్నా

● ఇరుకైన బ్రిడ్జి ● ఇబ్బందుల్లో వాహనదారులు

డొంకేశ్వర్, మే20: నికాల్‌పూర్ నుంచి దత్తాపూర్ గ్రామానికి వెళ్ళే ప్రధానరహదారిపై ఉన్న కెనాల్‌బ్రిడ్జి నిర్మాణానికి రూ.90 లక్షలు నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవ డంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి గుండా ప్రతీరోజు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైన కానీ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. కెనాల్‌పై నూతన బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు రాకపోకలు సులువుగా ఉండడంతో పాటు ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పుడు ఉన్న బ్రిడ్జి చాలా కాలం క్రితం నిర్మించిన బ్రిడ్జి కాలువతో పూర్తిగా శిథిలావస్థకు చేరి వాహనాలు రద్దీ పెరగడంతో బ్రిడ్జి చిన్నదిగా కావడంతో సైడ్‌వాల్ లేకపోవడంతో రాత్రి సమయల్లో అదుపు తప్పి కాలువలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థుల ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలు పూర్తి అవ్వగానే పనులు ప్రారంభిస్తామని చెప్పిన సంబంధిత అధికా రులు కానీ ఈ రోజు వరకు పనులు ప్రారంభించకపోవ డంతో ప్రజలు అవగాహన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి చిన్నది కావడంతో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనం కనబడక తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజుల క్రితం బైక్ మీద నందిపేట్ నుంచి పనులు ముగించుకొని నికాల్‌పూర్ వైపు మాధ్యమం సమయంలో వస్తుండగా బ్రిడ్జిపై నుంచి కాలువలో పడి స్వల్ప గాయాలతో వ్యక్తి బయటపడ్డాడు. దత్తాపూర్ నుంచి ఇసుక ట్రాక్టర్ నికాల్ వైపు వస్తుండగా అదుపు తప్పి కాలువలో పడిపోయింది. నికాల్‌పూర్ నుంచి నందిపేట వైపు వెళ్తున్న కారు కాలువలో పడి కారు ధ్వంసం అయ్యింది. ఎవరికి ఎటువంటి ప్రాణపాయ నష్టం జరుగకుండా బైక్‌పై ఓ వ్యక్తి ఆ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మలుపు బ్రిడ్జి చిన్నదిగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనబడక అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు జరుగకుండా ముందస్తుగా పనులు ప్రారంభించిన ట్లతే రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.



నికాల్‌పూర్,దత్తాపూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

పనులను త్వరగా చేపట్టాలి

నిధులు మంజూరై చాలా కాలం అవుతున్న ఇంత వరకు పనులు చేపట్టకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గం వెంట అనేక సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

- జలపతిరావు నికాల్‌పూర్

నోటీసులు జారీ చేశాం

కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులలో జాప్యంలో చేస్తున్నందు వల్ల నోటీసులు జారీ చేశాం. అయిన కూడా స్పందించకుంటే టెండర్లు రద్దు చేసి కొత్త వారికి టెండర్ వేసి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రఘు, ఆర్అండ్‌బీ ఏఈ

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

● బాన్సువాడలో మాయమవుతున్న బైకులు ● భయాందోళనలో వాహనదారులు ● పని చేయని నిఘా నేత్రాలు



బాన్సువాడలో బైక్ మాయమైన స్థలం ఇదే..

బాన్సువాడటౌన్, మే 20: కష్టపడి సంపాదించి ఇష్టమైన బైక్ కొనుక్కున్నా అన్నా....కుటుంబానికి ఎంతగానో తోడ్పాటుగా ఉంటుందని అనుకున్నా .... కానీ నా సంతోషం కొన్ని రోజుల్లోనే ఆవిరైపోతోంది. అప్పుడే పార్కు చేసిన తన బైక్ కానరాకపోవడంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. నా బైక్ పోయిందే...ఎక్కడైనా కనబడితే నా ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించగలరు అంటూ వాహన యజమానులు వాట్సాప్ గ్రూపులలో తమ వాహన నెంబరుతో సహా బైక్ ఫోటోలను పెడుతున్నారు. తమ వాహనాన్ని తామే వెతుక్కునే ప్రయత్నాలను చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో సైతం తమ వాహన ఆచూకీ కోసం వెతుకుతూ ఉన్నారు. తన వాహన జాడ కోసం వెతికి వెతికి అలసిపోతున్నారు. చివరకు ఫలితం లేకపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉండిపోతోన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో బైకు దొంగలు రెచ్చిపోతున్నారు. రద్దీగా ఉన్న ప్రాంతాల నుంచి దొంగలు కనురెప్పపాటులో బైకులను దొంగిలిస్తున్నారని వాహన యజమానులు వాపోతున్నారు. ఎక్కువ ఖరీదు ఉన్న బైకులపైనే దొంగలు దృష్టి సారించి అదను చూసి దొంగతనాలకు పాల్పడుతన్నట్లు సమాచారం.

● బాన్సువాడలో మాయమవుతున్న బైకులు

బాన్సువాడ పట్టణంలో బైకులు మాయమవుతున్నాయి. తాళం వేసిన వాహనాలను సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు , ఆస్పత్రులు, అంగడిబజార్ , ఇండ్లు ఇలా బైకులు ఎక్కడ పార్కింగ్ చేసినా కనురెప్పపాటులో మాయమవుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహన జాడ కోసం విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు చేసేదేమి లేక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి బాధతో ఇంటిముఖం పడుతున్నారు. ప్రతీ అవసరంలో తోడుగా ఉండే తమ వాహనం ఒక్కసారిగా అదృశ్యం కావడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. బైకులు బయటకు తీసుకవచ్చినా పార్కింగ్ చేయాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. తాజాగా ఓ వ్యక్తి కిరాణా సామాగ్రి కొనుగోలు చేసేందుకు బాన్సువాడ పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ బజార్ వెళ్లాడు. తన వాహనాన్ని అక్కడే పార్కింగ్ చేసి లోపలికి వెళ్లి సామగ్రి తీసుకుని బయటకు వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనబడకుండాపోవడంతో దిగాలు చెందాడు. స్మార్ట్ బజార్ సంస్థ వచ్చిపోయే దారిలో కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో పలువురు విస్మయానికి గురయ్యారు.

● సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతగానో ఉంది

బాన్సువాడ పట్టణం మున్సిపాలిటీగా మారిన రద్దీ బాగా పెరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వాహనాలపై వస్తూ ఉంటారు. అయితే పెట్టిన చోట నుండే వాహనం అదృశ్యమైతే ఆ యజమాని పడే అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పట్టణంలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతోగానో ఉంది. దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు తోడ్పతాయి. గతంలో పోలీసు అధికారులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అవి నేరుగా స్టేషన్‌లో ఉన్న టీవీకి కనెక్ట్ అయిఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం తొందరగా లభ్యమయ్యేది. కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పోలీసు అధికారులు చర్యలు తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు బాన్సువాడలో దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీకాలనీ నూతన కమిటీ నియామకం

ఆర్మూర్‌టౌన్ , మే20: పట్టణంలోని జిరాయత్‌నగర్ వద్ద కొండ లక్ష్మణ్ బాపూజీ కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా నియామించారు. సోమ వారం కాలనీ అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని అధ్యక్షు డిగా కట్కం ప్రకాష్, గౌరవ అధ్యక్షునిగా జిందం నరహరి, ప్రధా నకార్య దర్శి గోక నరేందర్, కోశాధికారిగా అంబల్ల దర్మవీర్, ఉపాధ్య క్షుడిగా మోర అశోక్, సహ యకార్యదర్శిగా మాన్‌పూర్ చిన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకొని కాలనీ వాసులు సన్మానించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

దోమకొండ,మే 20:మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన గుర్రపుగారి వెంకటి(50) సోమవారం ఉదయం గ్రామ శివారులో గల గుండ్ల చెరువులో బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు దోమకొండ పోలీసులు తెలిపారు.అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

1650కి.మీ దాటిన కేదారినాథ్ పాదయాత్ర

నందిపేట, మే20: మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పరమహంస భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని కేదారీనాథ్ ఆలయం వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం నాటికి 58వ రోజుకు చేరుకుంది. 2024 మార్చి 24న ఆశ్రమం నుంచి వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కాలి నడక 1650 కిలో మీటర్లు దాటింది. ప్రస్తుతం ఆశ్రమం భక్తులు ఉత్తరఖండ్‌లోని రిషికేష్‌లో ఉన్న గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమం నుంచి బద్రీనాథ్‌కు బయలు దేరారు. డెహ్రాడూన్‌కు 05కి.మీ, రిషికేష్‌కు, బద్రీనాథ్ ఆలయానికి 260కి.మీ దూరంలో భక్తులు ఉన్నారు. ప్రతీ రోజు 30 నుంచి 40 కి.మీటర్ల వరకు పాద యాత్ర చేస్తున్నామని, మరికొద్ది రోజుల్లోనే కేదారినాథ్‌కు చేరుకుంటామని భక్తులు తెలిపారు. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి పాదయాత్ర చేపట్టిన భక్తులు అందరు ఆరోగ్యంగా ఉన్నారని, ఆ దేవుడే మమ్మల్ని నడిపిస్తు న్నాడని పేర్కొన్నారు.



ఉత్తరఖండ్‌లో ఉన్న కౌల్‌పూర్ ఆశ్రమం వ్యవస్థాపకులు, భక్తులు

రైతు ఖాతాలోంచి రూ.50వేలు మాయం

లింగంపేట, మే 20 : లింగంపేట మండలంలోని అయ్యపల్లికి చెందిన రైతు చల్ల ఆదిరెడ్డి బ్యాంక్ ఖాతా నుంచి ఆదివారం సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి రూ.50వేలు దోచేశారని బాదితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ హ్యాక్‌చేసిన నేరగాళ్లు నెల రోజుల క్రితమే దక్కన్ గ్రామీణ బ్యాంక్ పేరుతో లింక్ పంపించారు. బ్యాంక్ లింక్ అనుకొని ఓపెన్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. అప్పటి నుంచి అతని ఖాతాలో డబ్బులు లేవు ఆదివారం తన స్నేహితుడు ఆదిరెడ్డి ఖాతాకు రూ.50వేలు పంపించగా అదే రోజు రెండు ఓటీపీలు వచ్చి ఖాతా నుంచి ఒక్కోసారి రూ.25వేల చొప్పున విత్‌డ్రా కావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సైబర్ క్రైమ్ నెంబర్‌కు ఫోన్ చేసి కేసు రిజిస్టర్ చేసినట్లు బాదితుడు తెలిపాడు. సైబర్ నేరగాళ్ల పట్ల బ్యాక్ ఖతాదారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై చైతన్యకుమార్ తెలియజేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం



దుర్గం రోడ్డు సమీపంలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

గాంధారి,మే 20: గాంధారి మండలంలోని దుర్గం,గుజ్జుల్‌తాండ, బీర్మల్‌తండా, జెమినితాండలకు వెళ్లె దుర్గం రోడ్డు సమీపంలోని వాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు బ్రిడ్జికూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాలు ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.గత సంవత్సరం క్రితం వర్షకాలంలో కురిసిన భారీ వర్గాలకు బ్రిడ్జిపై నీరు పారడంతో బ్రిడ్జి శిథిలవస్థకు చేరుకుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఎత్తిపోతల కమిటీ అధ్యక్షుడికి సన్మానం

డొంకేశ్వర్, మే20: ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌ల ఉమ్మడి నందిపేట, డొంకేశ్వర్ మండలాల అధ్యక్షునిగా ఎన్నికైన శుభసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నూత్‌పల్లి గ్రా మంలో మోర్తాడ్ బోజారెడ్డిని కలిసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, డీసీసీ జనరల్ సెక్రెటరీ దేగాం గంగారెడ్డి,యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై జిలుగ విత్తనాలు



ఏర్గట్లలో జిలుగు విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న ఏవో అబ్దుల్ మాలిక్

ఏర్గట్ల, మే 20: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సోమవారం రైతులకు సబ్సిడిపై జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై రూ.1116 లకు అందజేస్తుందని దీని కోసం రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్ జిరాక్స్ అందజేసి విత్తనాలు పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఈవో జక్కని శ్రీనివాస్, ఏఈవో సాయిసచిన్‌లు పాల్గొన్నారు.

● నేడు ఘన్‌పూర్, రాంపూర్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్, రాంపూర్ గ్రామాల రైతులకు జీలుగ విత్తనాలు నేడు ఉదయం 8గంటలకు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, తీసుకొచ్చి జీలుగ విత్తనాలు పొందలన్నారు. 30కిలోల బస్తా రూ.1116చెల్లించలని,ఈఆవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

ముప్కాల్: రైతులు సబ్సిడీపై వచ్చే జీలుగ విత్తనాలను ఉపయోగించుకొని భూసారాన్ని పెంచుకోవాలని భీమ్‌గల్ డివిజన్ ఏడీఏ కంపాటి మల్లయ్య అన్నారు. ముప్కాల్, బాల్కొండ మండలాల్లో రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం ముప్కాల్ మండలంలోని రెంజర్ల సొసైటీలో, బాల్కొండ సొసైటీలో 30కేజీల జీలుగ విత్తనాల బస్తా రూ.2790 కాగా 60శాతం సబ్సిడీ ద్వారా రూ.1116అందిస్తున్నట్టు వ్యవసాయాధికారి తెలిపారు. 30కేజీల జీలుగ విత్తనాల బస్తా ఒక ఎకరానికి సరిపోతుందని, రైతులు తమ పట్టాపాస్ బుక్ జిరాక్స్‌తో సొసైటీలో రాయితీపై జీలుగ విత్తనాలు తీసుకువెళ్ళాలని వ్యవసాయాధికారులు రాజ్‌కుమార్, మహేందర్‌లు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



డొంకేశ్వర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, మే20: రైతులకు నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను ఎరువులను ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గంగాధర్ అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని రైతులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఏకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని అన్నారు. రైతులకు పని ముటుట్లను ప్రభుత్వం సబ్సిడీలపై అందించాలని డిమాండ్ చేశారు. వరి పండించిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్‌ను రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు రకమైన విత్తనాలు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్, దామరంచలో జీలుగ విత్తనాలు పంపిణీ



బీర్కూర్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో కమల

బీర్కూర్, మే 20: బీర్కూర్ మండలంలోని బీర్కూర్, దామరంచ సహకార సంఘాలలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో కమల మాట్లాడుతూ బీర్కూర్, దామరంచ సహకార సంఘాలలో 166 బస్తాల చొప్పున 332 బస్తాల జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ఒక్కో బస్తా 30కేజీలు బరువు కలిగి ఉంటుందన్నారు. ఒక్క బస్తా కొనుగోలు చేస్తే రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. ఎకరానికి 12 కిలోల జీలుగు వేసుకోవచ్చని ఆమె రైతులకు సూచించారు. బహిరంగ మార్కెట్‌లో 30 కేజీల బస్తా ధర రూ.2,790 ఉంటుందని, ప్రభుత్వం 60 శాతం రూ.1674 భరిస్తుందన్నారు. రైతులకు రూ.1116 చెల్లించి బస్తా కొనుగోలు చేయవచ్చన్నారు. రాయితీపై విత్తనాలు పొందడానికి రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు మొబైల్ నెంబర్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ సీనియర్ ఏఈవో శ్రావణ్‌కుమార్, బైరాపూర్, ఏఈవో కావ్యశ్రీ, బీర్కూర్‌సహకార సంఘం సీఈవో విఠల్, సెల్ఫ్ మెన్ సాయిలు, రైతులు అవారి తదితరులు పాల్గొన్నారు.

సుంకెట్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సుంకెట్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మోర్తాడ్,మే 20:మండలంలోని సుంకెట్ గ్రామంలో 2000-21 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం ఒక చోట కలుసుకొని పూర్వవిద్యార్థులు సమ్మేళన కార్యక్రమం సంతోషంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాలలో వివిధ వృత్తులు, ఉద్యోగులుగా, వ్యాపారస్థులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు 24ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు పలకరించుకొని కుటుంబ విషయాలను తెలుసుకున్నారు.అనాటి పాఠశాలలో చదివిన స్మృత్తులను జ్ఞాపకం చేసుకుంటూ గడిపారు. తమకు విద్యబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు,శాలువతో ఘనంగా సన్మానిం చారు. పూర్వవిద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి వారంత సంతోషంగా గడిపారు.

కార్యకర్త అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే



బీజేపీ కార్యకర్త అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే యెండల

డిచ్‌పల్లి,మే 20: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త చిలకమరి సంతోశ్ అంతిమ యాత్రలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పాల్గొని నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉండటానని హామీ ఇచ్చారు.సంతోష్ ఆదివారం పంట చేను వద్ద ఉరేసుకొని ఆత్మహత్యా చేసుకున్నాడు.ఈఅంతిమ యాత్రలో మండల బీజేపీ నాయకులు వెంటకరమణ, రవిగౌడ్,లక్ష్మన్,బాలయ్య, ఉన్నారు.


బీర్కూర్ ఐకేపీ కార్యాలయంలో రివ్యూ నిర్వహిస్తున్న ఎంపీపీ రఘు

యూనిఫాంలను సిద్ధం చేయాలి

బీర్కూర్, మే 20: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికల్లా విద్యార్థులకు యూనిఫాంలు సిద్ధం చేసి ఉంచాలని ఎంపీపీ రఘు అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో భారతి, ఏపీఎం గంగాధర్‌లతో సమావేశమయ్యారు. విద్యార్థుల యూనిఫాంలు, చేపల పెంపకంపై ఎంపీపీ రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభం అయ్యే సమయాని కల్లా దుస్తులు సిద్ధం చేసి ఉంచాలన్నారు. చేపల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఎంపీపీ కోరారు. చేపల పెంపకానికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీ అందిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఏపీఎం గంగాధర్, సీసీలు తదితరులు ఉన్నారు.

అనుమతిలేని పాఠశాలల్లో చేర్పించొద్దు

కామారెడ్డి టౌన్, మే 20: జిల్లా కేంద్రంలో అనుమతిలేని పాఠశాలల్లో చేర్పించవద్దని ఎంఈవో ఎల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలకు ప్రభుత్వ అనుమతి ఉంది కానీ శాంతినికేతన్ రన్ బై ఎన్ఎస్ఆర్ ఈంపల్స్‌కి ఎలాంటి అనుమతి లేదని అన్నారు. అలాగే న్యూటన్, హర్ష, ఛాంపియన్, ప్రెసిడెన్సియ్ పాఠశాలలకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. కావున తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి విద్యార్థులను చేర్పించాలని సూచించారు.



ఉత్తరాలను పంపుతున్న సాధారణ బోగీల సాధనసమితి సభ్యులు

ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను పెంచాలి

కామారెడ్డి టౌన్, మే 20: ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల వద్ద మాట్లాడుతూ ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలను గాంధీ మార్గంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ దేశవ్యాప్తంగా 60 కోట్ల మందికి పైగా రైళ్ల ద్వారా ప్రయాణిస్తుండగా ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాశివనం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం, కోశాధికారి ఆంజనేయులు, కన్వీనర్ శంకర్, బాలయ్య, రవీందర్, నర్సింలు, హన్మండ్లు, వెంకట్‌రెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ మాక్‌టెస్ట్

కామారెడ్డి టౌన్, మే 20: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు ఉచిత పాలిటెక్నిక్ మాక్‌టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని పదో తరగతి పూర్తి చేసినటువంటి పాలిసెట్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

కామారెడ్డి రూరల్, మే 20: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల ప్రవీణ్ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం జయప్రకాష్ నారాయణ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలు శ్రీను, మోహన్‌రెడ్డి, అంజల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి టౌన్, మే 20: కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన బుచ్చన్న గారి శంకర్‌కు రెండు రోజుల జైలుశిక్ష పడిందని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు మద్యం తాగి వాహనాలను నడపకూడదని, అలా నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్లపై కేజీవీల్ పోట్లు..!

• అవగాహన కల్పించినా తీరు మార్చుకోని ట్రాక్టర్ డ్రైవర్లు • రోడ్లు ధ్వంసమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

భిక్కనూరు, మే 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవ స్థను మెరుగుపర్చి ప్రయాణికుల రాకపోకల సౌకర్యానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నాయి. ప్రభుత్వాల ఉద్దేశం బాగానే ఉన్నా కొందరు ట్రాక్టర్‌డ్రైవర్లు, యాజమానుల నిర్లక్ష్య వైఖరితో ఈ బీటీ రోడ్లన్నీ దెబ్బతింటున్నాయి. బీటీ రోడ్లపై కేజీవీల్స్ ఉపయోగించవద్దని పోలీసులు ఎంత చెప్తున్నా కొందరు ట్రాక్టర్ డ్రైవర్లు పెడచెవిన పెడుతున్నారు. కేజీవీల్స్‌తో రోడ్లపై వెళ్లడంతో సంవత్సరాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లను నెలల్లోనే ధ్వంసమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు ఎంత అవగాహన కల్పించినా కొందరు ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. వాతవరణ మార్పుల కారణంగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు వానకాలం పంటల సాగుకు సమాయాత్తమవుతున్న నేపథ్యంలో ముందుస్తుగా పోలీసులు, పీఆర్ అధికారులు గ్రామాల్లో ట్రాక్టర్ డ్రైవర్లకు, కేజీవీల్స్ తయారీదారులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు ఇదే అనువైన సమయమని పలువురు కోరుతున్నారు.

• అవగాహన కల్పించిన తీరు మారడం లేదు..

బీటీరోడ్డు వేసిన సమయంలో రోడ్ల ప్రారంభంలో పెద్దఎత్తున సంబంధిత అధికారులు కేజీవీల్స్ ఈ రోడ్డుపై నడపడానికి అనుమతి లేదు, ఒకవేళ నడిపితే జరిమానాలు విధించడంతో పాటుగా వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు సైతం ప్రతీ సీజన్‌లో గ్రామాల్లో ట్రాక్టర్ యాజమానులకు, డ్రైవర్లకు, కేజీవీల్స్ తయారీదారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇలాంటి ఎన్ని బోర్డులు పెట్టిన, ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టిన కొందరు ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లలో ఎలాంటి మార్పు రావడంలేదు. ఎవరైనా కేజీవీల్స్ నడపవద్దని ట్రాక్టర్ డ్రైర్లను ప్రశ్నిస్తే నేను ఒక్కడిని వెళితేనే రోడ్డు చెడిపోతేందా, ఏమేనా రోజు వెళ్తన్నామా, రాత్రి వేళలలో వేళ్తన్నాం కదా అంటూ సమాదానం ఇస్తున్నారని, కొందరైతే ఏకంగా అడిగినవారితో గొడవలు పెట్టుకోవడం, దాడులు చేయ్యడం లాంటివి చేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్లపై గుంతలు పడిన దృశ్యం


కేజ్‌వీళ్లు నడపడంతో ధ్వంసమైన గీతలు పడిన రోడ్డు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై వెళ్లడంతో రోడ్లన్నీ దెబ్బతిని ధ్వంసమవుతున్నాయి. కేజీవీల్స్ వెళ్లడంతో రోడ్డుపై కంకరతేలుతుంది. దీంతో జిల్లాలోని చాలాగ్రామాల్లో ఆ రోడ్లగుండా వాహనదారుల రాకపోకలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. చాలాచోట్ల ఈ గంతల కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందగా, చాలామంది మంది వాహనదారులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి.

రోడ్లపై కేజీవీల్స్ నడిపితే కఠినచర్యలు తప్పవు

• సంపత్‌కుమార్, సీఐ భిక్కనూరు

ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను నడపొద్దు. సూచనలను పాటించకుంటే భిక్కనూరు సర్కిల్ పరిధిలోని రోడ్లపై కేజీవీల్స్ నడిపితే భారీగా జరిమానాలతోపాటుగా వాహనాలను సీజ్ చేస్తాం. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యాజమానులకు, డ్రైవర్లకు, కేజీవీల్స్ తయారీదారులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. గ్రామాల్లో బీటీ రోడ్లపై కేజీవీల్స్ ఎవరైనా నడిపితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలి.


బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌కు అర్ధనగ్నంగా వచ్చిన వ్యక్తి

భార్య తనను కొడుతోందని పీఎస్‌లో భర్త ఫిర్యాదు

బాన్సువాడ, మే 20: భర్త చితకబాదితే భార్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్న ఈ కాలంలో భార్య తనను చితకబాదుతోందని ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఫిర్యాదు బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. బాన్సువాడ పట్టణంలోని రాజారాం దుబ్బాకు చెందిన గంగారాం ఆదివారం అర్ధరాత్రి అర్ధనగ్నంగా భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి రావడంతో పోలీసులు కంగుతిన్నారు. తనపై తరచూ భార్య దాడి చేసి కొడుతోందని, కేసు నమోదు చేయాలని పోలీసులను వేడుకున్నాడు. సదరు వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

వారాంతపు సంతలో మార్పు

మద్నూర్,మే 20: మండల కేంద్రంలో ఈ నెల 23, 24 తేదీల్లో లక్ష్మీ నారాయణ మందిరంలో జాతర, రథోత్సవం జరుగనున్న దృష్ట్యా మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే సంతను లక్ష్మీ నారాయణ మందిరం వైపు మారుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 23న రథోత్సవం ప్రారంభమై, 24న కుస్తీ పోటీలతో ముగియనుంది. అందుకు గాను ప్రజలందరూ ఆలయానికి వచ్చి దర్శనం చేసుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.నాలుగు రోజుల పాటు రథోత్సవ కార్యక్రమం జరుపనున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు రావడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వ కాలం రథం తీసి రంగులు తీసి సిద్ధం చేశారు.

రత్ గల్లిలో సంత ఏర్పాటు


ఉపాధిహామీలో అతివలదేపై చేయి!

మద్నూర్, మే20: ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా పథకాల్లో అతివలదే పైచేయి గా కన్పిస్తోంది. వలసలను అరికట్టి ఉన్న ఊరిలో పనులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తోంది. దీని కింద వివిధ పనులు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక భరోసా ఇస్తోంది. పల్లెల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. అయితేవీటిని సద్వినియోగం చేసుకోవడంలో పురుషులకంటే మహిళలే అధిక సంఖ్యలో ఉండటం విశేషం.


ఉపాధి పనుల్లో మహిళలు

అధిక సంఖ్యలో మహిళలు

ఉమ్మడి మద్నూర్ మండలంలో 14846 మంది ఉపాధి హామీలో పేర్లు నమోదు చేసుకోగా, ప్రభుత్వం వారికి జాబ్ కార్డులను జారీచేశారు. వీటిలో 8630 మంది మహిళలు, 6216 మంది పురుషులున్నారు. కాగా, ప్రస్తుతం పని చేస్తున్న జాబ్‌కార్డులు 8478 మందివాటిలో 5500 మంది మహిళలు, 2978 మంది పురుషులు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

పురుషుల కంటే అధికంగా

ఉపాధి పనుల్లో పురుషులకంటే మహిళలే అధికంగా భాగస్వాములు అవుతున్నారు. 5వేల 500 మందిమహిళలు, 2279 మంది పురుషులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాల్లో అతివలదే పైచేయి. రోజుకు కూలీలకు గాను సరాసరి 200 కూలీ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేయూత ఇస్తోంది. వేసవిలో వలసలు వెళ్లకుండా జాతీయ ఉపాధిలో భాగస్వాములు అవుతున్నారు.

• ప్రతి ఒక్కరికీ పనులు : ఏపీవో పద్మ

పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డులు అమలుచేసి పనులు ఇస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో మహిళలు ముందంజలో ఉండటం విశేషం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

రేణుకాదేవి ఆలయంలో పూజలు

దోమకొండ, మే 20: మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ 19వ వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, అమ్మవారికి అభిషేకం, అలంకరణ, హారతి, మంత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

బీర్కూర్, మే20: మండలంలోని కిష్టాపూర్‌లో సోమవారం బోయి సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 3వ వార్షికోత్సవం సందర్భంగా బోయి సంఘం సభ్యులు గంగమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోయి సంఘం అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు మొండి అంజయ్య, గంగారాం, హన్మాండ్లు, గోపాల్, శంకర్, సాయిలు, వీరేశం, అంజయ్య, దత్తు, బోయి కులస్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

సర్వసభ్య సమావేశం అంటే అధికారులకు చిన్న చూపా?

• బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్రాంరెడ్డి

బాన్సువాడ, మే 20: సర్వసభ్య సమావేశం అంటే చిన్న చూపా అంటూ ఎంపీపీ నీరజా అధికారులపై మండిపడ్డారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఐదు సంవత్సరాలుగా ఆర్టీసీ అధికారులు నివేదికలు సమర్పించకపోవడంతో ఎంపీపీ మండిపడ్డారు. కొల్లూరు - బీర్కూర్ బస్సు వేయాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు కోరినా ఇప్పటి వరకు వేయలేదన్నారు. హరితహారంలో రహదారుల వెంట నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా మారాయని, కానీ కొందరు వృక్షాలను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హన్మాజీపేట్ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ కోతలు బాగా పెరిగిపోయాయని, కోనాపూర్ ఎంపీటీసీ జెట్టి హన్మాండ్లు పేర్కొన్నారు. ఉపాధిహామీ పనుల్లో కూడా సక్రమంగా జరగడం లేదని అధికారులు వెంటనే పర్యవేక్షించాలని కోరారు. గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామంలో ప్రతిరోజూ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలని తాగునీరు, డ్రైనేజీల శుభ్రత, పారిశుధ్యం లోపం లేకుండా ఎప్పటికప్పుడు చూడాలని అధికారులకు ఎంపీపీ ఆదేశించారు. వర్షాకాలం రానున్న కాలం సందర్భంగా అధికారులు ఎప్పటికప్పుడు చెరువు కట్టల వద్ద గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లు శుభ్రపరిచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆమె ఆదేశించారు. అంతేకాకుండా సబ్ స్టేషన్‌లో వారీగా విద్యుత్ అధికారులు వివరాలు సేకరించి ప్రజలకు రైతులకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా వచ్చే నెల నుంచి పాఠశాలలు ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో పాటు భవనాలను పరిశీలించి శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే తొలగించి నూతన భవనాల్లోకి మార్చాలని ఆమె ఆదేశించారు. ఏదేమైనా ప్రజలకు, అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు సమస్యలే లేకుండా ఉంటారని ఆమె సూచించారు. గత ఐదేళ్లలో సహకరించిన ఎంపీటీసీలకు అధికారులకు పత్రికా మీడియా సోదరులకు ఎంపీపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, వైస్ ఎంపీపీ హరిసింగ్, సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ


చించోలి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో అనిత

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలి

బీర్కూర్, మే 20: వర్షాకాలంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలని, అందుకోసం మొక్కలను సిద్ధం చేసి ఉంచాలని ఎంపీవో అనిత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆమె బీర్కూర్ మండలం చించొల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతీ గ్రామంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, పారిశుధ్యం లోపం లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట జీపీ కార్యదర్శి నవీన్ తదితరులు ఉన్నారు.

లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల విత్తనాలనే రైతులకు అమ్మాలి

ఎడపల్లి, మే 20: లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల విత్తనాలనే రైతులకు డీలర్లు అమ్మాలని బోధన్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని పలు ఫర్టిలయిజర్ షాపులను సోమవారం రాత్రి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ద రామేశ్వర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాలలో ఉన్న వరి విత్తనాలను, వాటి రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ డీలరు లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల వద్దనే వరి విత్తనాలు కొని వాటిని రైతులకు అమ్మాలని ఆయన సూచించారు. రైతులు విత్తనాలు కొనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుని వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన కంపెనీ, వాటి లైసెన్సు నంబరు చూసుకుని డీలర్ వద్ద కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన వరి విత్తనాలకు తప్పకుండా జీఎస్టీ నంబరు ఉన్న రశీదును పొందాలని ఆయన సూచించారు. దుకాణ యజమాని ఇచ్చిన రశీదును పంటకాలం పూర్తయ్యే వరకు దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నిధులతో బోరుబావి ఏర్పాటు

తాడ్వాయి, మే20: మండలకేంద్రంలోని బీసీ కాలనీలో ఎల్లారె డ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ నిధులతో బోరుబావిని తవ్వించారు. బీసీ కాలనీలో నీటిఎద్దడి ఉండడంతో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో వెంటనే నిధులు మంజూరు చేశారు. దీంతో బోరుబావి తవ్వించగా పుష్కలంగా నీళ్ల వచ్చాయని కాలనీవాసులు తెలిపారు. బోరు బావి తవ్వించడంతో కాలనీలో నీటి ఎద్దడి నివారించినట్లు అయిందని కాలనీవాసులు తెలిపారు.


• బోరు బావి ఏర్పాటు చేసిన దృశ్యం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

